# ఏటిలోని కెరటాలు లేదా
# బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్

"ఏరా! అంత ఆలోచన దేనికీ? వెంటనే వస్తున్నావా?" దుఃఖాన్ని దిగ మింగుకుంటూ, న్యూజెర్సీలో ఉన్న కొడుకు రమేష్‌ని ఫోన్‌లో అడిగింది అరుంధతి.

"నువ్వు అలా అడిగితే నేనెలా చెప్తాను? టిక్కెట్లు దొరకాలి కదా!"

"నేనొక్కదాన్నే అయిపోయాను... పోనీ అక్కయ్యని పంపు..."

"ప్చ్... ఏంటి? నేను రాలేకపోతే అదెల్లా వస్తుంది? ఇద్దరం ఇక్కడే కదా ఉన్నాం... ఎంత లేదన్నా మూడు నాలుగు రోజులు పడ్తుంది."

"అంతవరకూ... శవాన్ని ఎలా ఉంచుతాం?"

"ఏదైనా ఆస్పత్రిలో ఉంచండి... లేదా... ఎవరితోనైనా కర్మ చేయించు..."

ఎవరితోనైనా చేయించు... గొంతు పూడుకుపోయింది ఆ మాటకి.

పక్కనే కూచుని అన్నీ వింటున్న రాజేశ్వరి, అరుంధతి మొహాన్నే చూస్తోంది.

"ఏఁవంటాడు రమేషు?"

"టిక్కెట్లు దొరకలేదుట. మళ్ళా ప్రయత్నిస్తానని అన్నాడు. ఎంత లేదన్నా మూడు నాలుగు రోజులు పడ్తుందిట..." అయోమయంగా అంది.

అక్కడున్న వాళ్ళంతా అదే డిస్కషన్.

అబ్బాయి రాకపోతే ఎవరు చేస్తారు?

"పిల్లాడొచ్చేవరకూ ఆ మడిసిని ఎలా ఉంచుతారు? మరిది వస్తే చేస్తాడు... విశ్వనాధానికి కబురు చేసారా?" ఎవరో అడిగారు.

చేసాం అని చెప్పలేకపోయింది.

కూతురు, కొడుకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. సారాంశం మాత్రం ఒకటే! రావడానికి కుదరదు. మూడు, నాలుగు రోజులు పడ్తుంది అని.

"ఎవరితోనైనా చేయించు, ఉంచడానికి కుదరకపోతే..."

"ఇలాంటివి అందరూ చెయ్యరు..."

"అదేంటమ్మా! బాబాయి ఉన్నారు. కదా!" నాన్నగారికి ఆయన చెయ్యచ్చుకదా!

అన్నాడు కానీ, రమేష్‌కి బాబాయి మొహం కూడా గుర్తుందో లేదో అనుమానమే అరుంధతికి.

పిల్లలకి ఊహ తెలిసినప్పట్నించి వాళ్ళ బాబాయిని చూళ్ళేదు. అరుంధతి భర్త జగన్నాధానికి, తమ్ముడు విశ్వనాధానికి మధ్య పదేళ్ళు తేడా ఉంది.

విశ్వనాధం పెళ్ళయ్యాక, భార్య మీనాక్షితో అన్నగారింట్లోనే ఉన్నాడు.

కాని, మీనాక్షి ఆమెతో కలిసి ఉండలేకపోయింది. ఒక్క రెండేళ్ళు ఎలాగో ఉంది. ఆ తర్వాత ట్రాన్స్‌ఫర్ కాకినాడ చేయించుకుని వెళ్ళిపోయారు.

"మొగుడూ, పెళ్ళాలే విడిపోతున్న రోజులివి. సెల్ఫ్ రెస్పెక్ట్ ముఖ్యం. ఆవిడ మాటలు పడ్తు ఉండాల్సిన కర్మ నాకేంలేదు. తోడికోడళ్ళుగా కలిసి ఉండాలి. అని ఆమె అనుకున్న రోజున, ఆమె పిలిచిన రోజునే నేనా యింటి గడపు తొక్కుతా. అంతవరకూ ఆ యింటికెళ్ళను." అన్న మంగుమ్మశపథం అనోటా, ఈనోటా వినింది అరుంధతి అయితే నా గడప తొక్కకర లేదు. నా ఇంటికి రావక్కరలేదు. నేను పిలవను. ఎం చేస్తుంది? అని పంతం పోయి, కొడుకుకి వొడుగు అయినా పెళ్లి అయిన కూతురి పెళ్ళి అయినా గృహ ప్రవేశమైనా పిలవలేదు. నాలుగు సార్లు అమెరికాకు వెళ్లింది. మరిదికి, తోడి కోడలికి తెలియకుండా జాగ్రత పడింది.

అలాంటిది ఈరోజున... "మీ అన్నయ్య పోయారు, నువ్వు కర్మకాండలు చెయ్యాలి. మీనాక్షిని తీసుకుని రా" అని ఏవిధంగా అనగలదు?

ఒకవేళ ఏదోవిధంగా అడిగినా, "ఇప్పుడు కావాల్సివచ్చామా?

శుభకార్యాలకి పిలవకుండా, ఈ రోజున ఇలాంటి అశుభకార్యానికెల్లా, ఏ మొహం పెట్టుకుని కబురు చేస్తున్నారు?" తోడికోడలు మొహం కళ్ళముందు కదలాడింది.

వచ్చినవాళ్ళల్లో చాలామంది డయాబెటిక్ పేషెంట్లే అందుకని వాళ్ళు కాఫీ, టీలు మధ్య మధ్యలో వంటింట్లోకి వెళ్ళి, అక్కడ అడిగి మరీ తాగుతున్నారు.

"ఏంవన్నాడు పిల్లాడు? వొస్తానంటున్నాడా?"

అరుంధతి నిశ్శబ్ధంగా ఉండిపోయింది.

"దగ్గర కాదు కదా,-ఇలా కబురందగానే అలా తత్కాల్‌లో టిక్కెట్లు కొనుక్కొని వచ్చేదానికి, బోల్డు దూరం. వెంటనే ఆ విమానాల్లో టిక్కెట్లు దొరకాలి కదా!..." ఎవరో అన్నారు.

"రాకపోతే ఎవరు చేస్తారు?"

అరుంధతి ఏం మాట్లాడలేదు.

ఎవరు చేస్తారు?

కొడుక్కి ఫోన్ చేసింది.

"ఏం చెయ్యాలి?"

"నా ఫ్రెండ్ గిరీష్ తెలుసు కదా! వాడికి ఫోన్ చేసాను. వాడు వచ్చి అన్ని విధాలుగా నీకు సాయం చేస్తాడు. గిరీష్ రూపంలో ఉన్న నేనే అనుకో... నీ కొడుకనే అనుకో... ముందు జరగాల్సిన కార్యక్రమం వాడు చేస్తాడు. మిగిలినది మేం వచ్చాకా చేస్తాం..."

"గిరీషా... మనవాళ్ళు కారు కదా!" నసిగింది.

"మన మనిషే లేనప్పుడు మన పర ఏంవిటీ? చాదస్తాలేం పెట్టుకోకు... మనసు ముఖ్యం... వాడిని కూడా నాతో సమానంగానే చూసావు కదా..."

మరో పావుగంటకి గిరీష్ వచ్చాడు.

షామియానా వేయించాడు.

కేటరర్‌ని తీసుకొచ్చాడు.

చిన్న చిన్న పనులు చేయడానికి జగన్నాథగారి పార్థివ శరీరాన్ని తీసుకెళ్ళాకా నీళ్ళు కాఫీ టీలు అందించమని సెల్లార్ అంత శుభ్రం చేయడానికి పనిమనిషులని తెచ్చాడు.

చిన్న స్టూలు ఎక్కి గోడకి ఉన్న జగన్నాథంగారి ఫోటో తీసి అందించాడు. గంధం పెట్టి, దానిమీద కుంకం అద్ది ఇచ్చాడు.

దాన్ని తీసి ఓ మూల చిన్న స్టూలు మీద పెట్టాడు. ఎదుటి ఫ్లాటులో ఉండే కార్తీక్, వెంకటేశ్వర్లు ఓ పది అగరత్తులు వెలిగించి పెట్టారు.

వజ్యులు వచ్చారు. ఆయన వస్తూనే పైనున్న షర్టు తీసేసి "కర్మ చేసేవాళ్ళు స్నానం చేసి రావాలి" అని అన్నాడు.

అందరూ మొహామొహాలు చూసుకున్నారు.

దగ్గర వాళ్ళెవరూ లేరు. అందరూ ఇదే ఊళ్ళో ఉన్నారు. కానీ, ఆ రోజు శుక్రవారం అయిందని ఎవరూ రాలేదు.

ఓ మనిషికి కష్టం వచ్చినప్పుడు, కాస్త మాట సాయం చేయడానికి శుక్రవారం, మంగళవారం అంటూ రోజులు చూస్తారా? ఏం ఛాదస్తమో !

'దగ్గరవాళ్లు' అనేదానికి అర్థం ఏంవిటో అని అనుకుంది అరుంధతి "గిరీష్ నువ్వు చెయ్యి..." వొణుకుతున్న గొంతుతో అంది. అందరూ మొహ మొహాలు చూసుకున్నారు.

"వాళ్ళబ్బాయి రమేష్‌కి స్నేహితుడట... కొడుకు ఇక్కడ ఉండడు కాబట్టీ, వీళ్ళ వ్యవహారాలన్నీ ఈ అబ్బాయే చూస్తూంటాడుట."

"నేనా?..." ఆశ్చర్యంగా అడిగాడు. అరుంధతిని చూస్తూ,

"నువ్వే... నువ్వూ రమేష్ వేరు కాదు... నాకు ఇద్దరూ ఒకటే..."

"కాని, నేను క్రిస్టియన్ కదండి..."

అంతా విగ్రహాల్లాగా మారిపోయారు. గుసగుసలు మొదలయ్యాయి.

"ఏమిటీ అధర్మం!"

అరుంధతి పినతల్లి కొడుకు సుబ్రమణ్యం అరుంధతి పక్కన

నుంచున్నాడు.

"అక్కా! నీకేమయినా మతిపోయిందా? ఈ అబ్బాయితో చేయిస్తావా?"

"ఏం చెయ్యను? వాడికి రావడానికి వీల్లేదు. ఆయనవైపు వాళ్ళు జ్ఞాతులు ఎవరూ రాలేదు. ఇంకేం చేస్తాను? ఆడదాన్ని ఒంటరిగా ఉన్నాను..."

"నీ మరదలు కడుపు. ఆ సంగతి తెలుసు కదా! నేను చెయ్యడానికి వీల్లేదు... లేకపోతే ఈ స్థితి రానిస్తానా?" అన్నాడు సుబ్రమణ్యం.

"సుబ్రమణ్యం! ఏమిటీ, నన్నుండమంటారా? వెళ్ళమంటారా? నేనింకో చోటకెళ్ళాలి... ఏదో ఒకటి చెప్పండి గమ్మున..."

"గిరీష్ చేస్తాడు... గిరీష్ నువ్వే చెయ్యి... నీకేం అభ్యంతరం లేదు కదా..."

"మాకుందమ్మా! అభ్యంతరం మాకుంది. మన కులం కాదు, మన మతం కాదు..."

"అబ్బాయి మా కొడుకులాంటివాడు..."

"బావుందమ్మా... చాలా బావుంది... వినడానికి ఎంతో బావుంది తల్లీ... అదేదో సినిమాలోలాగా కొడుకులాంటివాడు అని అంటున్నావు కానీ, కొడుకే అని గట్టిగా అనగలిగావా? అనలేదు కదా, అంటే ఆ రెంటికీ తేడా నీకు తెలుసన్నమాట..." అన్నాడు సుబ్రమణ్యం.

"నా కొడుకే అనుకోండి..." ఏమనాలో తెలీక గబుక్కున అనేసింది.

"అని నువ్వనుకుంటే సరిపోదు... సమాజం కూడా అనుకోవాలి."

"శవాన్ని ముందుంచుకుని ఏమిటీ వితండవాదం!"

అరుంధతి ఏమనలేకపోయింది.

"మొన్నటి వరకూ జగన్నాథం అంత అదృష్టవంతుడు లేరనుకున్నారు... కానీ యివాళ పరిస్థితి....." ఎవరో అంటున్నారు.

– "అమ్మా నా కొచ్చిన మంత్రాలు వేరు. రెండు మతాల మంత్రాలు నాకు రావు. వాళ్ళ మతం సంగతి నాకు తెలీదు. ఇలాంటి అధర్మకార్యాలు

నేనెప్పుడూ చేయించలేదు. ఆ శాస్త్రాలు నాకు తెలీదు. అవేవో తెలిసినవాళ్ళ దగ్గరికెళ్ళండి. లేదా చర్చికి తీసుకెళ్ళండి... నా టైం వేస్ట్ చేయకుండా ఉంటే పదివేలు..." అంటూ సుబ్రమణ్యాన్ని చూసాడు.

"క్షమించండి, నాకు కొన్ని నియమాలున్నాయి. వాటిని నేను అతిక్రమించలేను..." అంటూ కదిలాడు.

"ఏఁవిటో పిల్లలున్నారు. సమయానికి ఒక్కళ్ళు లేరు. ఉండి లేనివాళ్ళయ్యారు. లేనివాళ్ళకు ఎలాగూ లేదు. ఇది ఉండి లేని ఖర్మ..."

అరుంధతి ఇంక వినలేక బ్రాహ్మడి దగ్గరికెళ్ళింది.

"నేను చేస్తాను. ముప్పయైదేళ్ళు కలిసి ఉన్నాము. ఆయనకి ఎవరూ లేకపోవడం ఏఁవిటీ? నేనున్నాను. నేను చేస్తాను..."

అంతా వింతగా చూసారు ఆమెను.

"ఏఁవిటే మతి గానీ పోయిందా? ఏం మాట్లాడుతున్నావో నీకేం తెలీడం లేదు, వెనక్కిరా" అంటూ ఆమె మేనత్తకూతురు రాజేశ్వరి అరుంధతిని వెనక్కి లాగింది.

"శివాలయంలో మా వెఱ్ఱిబాబుంటాడు. ఇలాంటి సమయాల్లో వాడు పనికొస్తాడు. ఫోన్ చేస్తాను... వాడిని రమ్మంటాను." అంటూ సెల్‌లో నంబర్లని టకటకా నొక్కేసాడు.

అదే సమయానికి ఓ ఆటో ఆగింది. అందరూ అటే చూసారు.

అందులోంచి ఓ బట్టతలాయన, ఓ నడివయసావిడ, ఓ యువకుడూ దిగారు.

"విస్సినాథం కదూ!" సుబ్రమణ్యం అన్నాడు.

అరుంధతి ఉలిక్కిపడి గేటువైపు చూసింది.

నిజమే. విశ్వనాథం, మీనాక్షిని కూడా పోల్చుకుంది. ఇరవయిఏళ్ళ తర్వాత... ఇప్పుడే చూస్తోంది.

"తమ్ముడుట... కాకినాడనుంచి వచ్చారు... ఏఁవైనా సరిగ్గా టయానికి

వచ్చారు..."

మీనాక్షి తోడికోడలు అరుంధతిని వాటేసుకుని ఒక్కసారి ఏడ్చేసింది. అరుంధతి కూడా అలాంటి స్పర్శ కోసమే చూస్తోంది. ఆమె కూడా మీనాక్షి భుజం మీద తల ఉంచి ఏడ్వడం మొదలెట్టింది.

"కర్మ నేను చేస్తాను. కబురు తెలిసేప్పటికి రైళ్ళు లేవు. రెండు బస్సులు పట్టుకుని వచ్చేప్పటికి ఈ టైముమయింది."

కబురు ఎవరు చేసారు? కొడుకుకి విశ్వనాధం నంబరు తెలీదు.

పక్క ఫ్లాటుల్లోని కార్తీక్, వెంకటేశ్వర్లు టెలిఫోన్ కింద ఉన్న టెలిఫోన్ బుక్కు తీసి ఫోన్ చేసి ఉంటారు.

విశ్వనాధం స్నానం చేసి తడిబట్టల్తో గురువుగారి పక్కన కూచున్నాడు.

ఎవరితోనైనా చేయించు అన్న కొడుకు

నేను చేస్తాను అంటూ అన్నీ మర్చిపోయి ముందుకొచ్చిన సురిది.

ఎవరు నా వాళ్ళు! ఎవ రు పరాయివాళ్ళు!

కొడుకైనా, తమ్ముడైనా రక్తం రక్తమే. ఒకేలాంటి అభిమానం. అందుకే బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్. ఏటిలోని కెరటాలు ఎక్కడికెళ్తాయి. ఎంత ముందుకెళ్ళినా, ఏట్లోకే చేర్తాయి.

(సుజన రంజని సిలికాన్ ఆంధ్ర ,
సాంస్కృతోత్సవ, ప్రత్యేక సంచిక కుటుంబ కదంబరి 2007)